క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా వెంకటరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న పడాల వెంకటరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా అనపర్తికి చెందిన పడాల వెంకటరెడ్డి ఎంపికైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి దాసు, కొప్పవరం మాజీ సర్పంచి తాడి సూరారెడ్డి, మల్లిడి గోవిందరెడ్డి, తిరగటి శివ, మర్రె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సదస్సు విజయవంతానికి పిలుపు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రైతు కూలీ సంఘం ప్రతినిధులు

రాజానగరం: విశాఖపట్నంలో ఈ నెల 21న జరిగే అఖిల భారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక డివిజన్ కార్యాలయంలో విడుదల చేశారు. ఆదివాసీల అస్తిత్వ రక్షణకు పర్యావరణ జీవావరణాల పరిరక్షణకు ఈ సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సదస్సుకు గిరినులంతా తరలిరావాలన్నారు. రైతు కూలీ సంఘం ప్రతినిధులు మరుకుర్తి వీరలక్ష్మి, నక్క లక్ష్మి, ఉంగరాల వరలక్ష్మి, దమ్ము సీత, గున్నూరు బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి బస్సు సర్వీసు నడపాలని వినతి

గోకవరం: రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని వెదురుపాకకు చెందిన ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రామన్నకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడి నుంచి విమానాశ్రయానికి నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తున్నారని, అక్కడి నుంచి ప్రైవేటు రవాణా మినహా ఇతర వసతి లేదన్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించి విమానాలు వచ్చే సమయంలో విమానాశ్రయానికి బస్సు సర్వీసులు నడపాలని విజ్ఞప్తి చేశారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న వీరవెంకట సత్యసూర్యకుమారి

మధురపూడి: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమస్యలు పరిష్కరించవచ్చని కోరుకొండ మండల పరిషత్ అధ్యక్షురాలు ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి అన్నారు. శుక్రవారం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులెవరైనా సర్వసభ్య సమావేశానికి హాజరుకాకుంటే పీఆర్ చట్టం ప్రకారం అనర్హతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం. ఐస్‌క్రీమ్‌లతో కూడిన బాక్స్‌ని బైకుపై పెట్టుకుని, రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వైపు వెళ్తున్న ఓ యువకుడు పైప్రాంతంలో ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన అతనిని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అతని వద్ద ఏవిధమైన రికార్డు లేకపోవడంతో ఆ యువకుడు ఎవరనే విషయాలు తెలియలేదు. ఈ విషయమై బొమ్మూరు పోలీసులను వివరణ కోరగా ఆస్పత్రి వర్గాల నుంచి సమాచారం రావాల్సి ఉందన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఇంటర్ తప్పిన విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- సప్లిమెంటరీ పరీక్షల్లో పాసయ్యేలా తరగతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ తప్పిన విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న అధ్యాపకుడు

రంగంపేట: ప్రభుత్వ విద్యలో నూతన విధానాలకు నాంది పలుకుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో వినూత్న పద్ధతికి తెర తీసింది. గతంలో పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల కోసం ప్రైవేటు క్లాసులకు వెళ్లడమో, లేక ఇంటి వద్దే సొంతంగా చదువుకోవడమో చేసేవారు. కాని ఇంటర్ ఫెయిలైన వారి కోసం ప్రభుత్వం మళ్లీ కాలేజీల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఏ ఒక్క విద్యార్థి వెనుకబడిపోకూడదనే ఉద్దేశంతో అధ్యాపకులను రప్పించి ఫెయిలైన విద్యార్థులకు మళ్లీ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా క్లాసులు చెబుతున్నారు. ఈ క్లాసులకు ఇంటర్ తప్పిన విద్యార్థులందరకూ హాజరై సద్వినియోగం చేసుకుంటున్నారు. ఏ ఒక్క విద్యార్థి నష్టపోకూడదనే ఆలోచనతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లాసులు ప్రారంభం

ఇంటర్మీడియట్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అందుకే మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ తప్పిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు జరుపుతున్నారు. అధ్యాపకులందరూ కళాశాలల్లో అందుబాటులో ఉంటూ సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇలాంటి ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు కోరుతున్నారు. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 147 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 30 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బైపీసీ చదువుతున్న జి.రమ్యశ్రీ 440 మార్కులకు 404 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. మిగిలిన 117 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 113 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 40 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బైపీసీ చదువుతున్న పీవీ గాయత్రి 1000 మార్కులకు గాను 945 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. మిగిలిన 73 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్ తప్పిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. దీని ప్రకారం సంబంధిత అధ్యాపకులందరూ కళాశాలల్లో అందుబాటులో ఉండి విద్యార్థులకు బోధిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రంగంపేట

చోరీ ఘటనపై ఫిర్యాదు

బిక్కవోలు: పందలపాకలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు పథకం సర్వే రాయిని దొంగలించాడని తహసీల్దార్ పోసుబాబు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 393 ప్రభుత్వ పుంత వద్ద వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా సర్వే రాయిని పాతారు. అయితే అదే గ్రామానికి చెందిన గుత్తుల గోవిందు సదరు రాయిని అక్కడ నుంచి తీసేసి అక్కడ ఇనుప రాడ్డు పాతాడు. దీంతో ధాన్యం తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉందని కొంతమంది రైతులు అడగగా వారిని చంపుతానంటూ బెదిరించినట్లు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చినకొండేపూడిలో ఫ్యామిలీ డాక్టర్

సీతానగరం: చినకొండేపూడిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.రాజు ఆధ్వర్యంలో 645 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం విశాలాక్షి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన



కామరాజుపేటలో రైతులు, కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖ అధికారులు

గోకవరం: పర్యావరణహిత జీవనశైలిని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని మల్లవరం సెక్షన్ అధికారి పి.వెంకట్రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు శుక్రవారం మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూమిలో పర్యావరణహిత జీవనశైలిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని రైతులు, వ్యవసాయ కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. నీటి వృథాకు అడ్డుకట్టవేయాలని, సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూదికొండ బీటు అధికారి డి.కామేశ్వరరావు, మల్లవరం బీటు అధికారులు వై.ఝాన్సీరాణి, టి.రాజా రమేష్, రైతులు పాల్గొన్నారు.

తరగతి గదులకు శంకుస్థాపన

మధురపూడి: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో అదనపు తరగతుల నిర్మాణానికి శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. నాడు–నేడు పథకంలో ఏడు తరగతి గదులకు గాను రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు జెడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి, పార్టీ మండల కో–కన్వీనర్ గణేశుల పోసి, నాయకులు ఇందుగమెల్లి సత్యనారాయణ, ఆకుల శ్రీను, బత్తిన త్రిమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

గోకవరం: రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బద్దిరెడ్డి నాగ వెంకటేశ్వరరావు సూచించారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. పలు అంశాలపై చర్చించారు. రబీ ధాన్యం కలిగి ఉన్న రైతులకు సిబ్బంది సహకరించి సమీపంలోని జంభూపట్నం రైస్ మిల్లుకు పంపించాలన్నారు. మండలంలో మట్టి నమూనాల సేకరణ చురుగ్గా జరుగుతుందన్నారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైతు భరోసా నెల వారీ మ్యాగజైన్‌ను ఆవిష్కరించి రైతులకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మధురపూడి: నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ నాయకులు శుక్రవారం నార్త్ జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. తొలుత ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నీరుకొండ వీరన్నచౌదరి ఆధ్వర్యంలో కోరుకొండలో ర్యాలీ చేశారు. కాతేరు నుంచి సీతానగరం రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఆవ భూముల్లో అక్రమాలు అరికట్టాలని నినాదాలు చేశారు. ఆయా మండలాల కన్వీనర్లు నీలపాల వెంకన్న, గుడపటి జయరామ్, పేపకాయల కాశీ పాల్గొన్నారు.

ఆచార్య టేకి మృతి తీరనిలోటు



ఆచార్య టేకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యూనివర్సిటీ అధికారులు

రాజానగరం: ఆచార్య ఎస్.టేకి మృతి యూనివర్సిటీకి తీరనిలోటని ఆదికవి నన్నయ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ ఈసీ హాలులో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టేకి చిత్రపటానికి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరంతరం చలాకీగా ఉంటే ఆచార్య టేకి గుండెపోటుకు గురికావడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఓ మంచి అధ్యాపకుడిని కోల్పోయామంటూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. యూనివర్సిటీ అధికారులు ఆచార్య పి.సురేష్‌వర్మ, ఆచార్యులు కేఎస్ రమేష్, వై.శ్రీనివాసరావు, డి.జ్యోతిర్మయి, డాక్టర్ బికెజియారాణి, డాక్టర్ ఎం.కమలాకుమారి, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ ఎ.మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆచార్య ఎస్.టేకి మృతికి పలువురు ఆన్‌లైన్‌లో సంతాపాన్ని తెలిపారు. ఇందులో నూతన వీసీగా నియమితులైన ఆచార్య కె.పద్మరాజు, పూర్వపు వీసీలు ఆచార్య కె.నిరూపారాణి, అల్లం అప్పారావు, పి.జార్జివిక్టర్, ఎం.ముత్యాలనాయుడు, ఏవీ ప్రసాదరావు ఉన్నారు.

● ఘనంగా గ్రామోత్సవం



బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు గ్రామంలో వేంచేసియున్న విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం కలశాల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది భక్తులు 108 కలశాలతో గ్రామోత్సవం చేశారు. ఆలయంలో నిత్యోపాసన, క్షీరాధివాసము, క్షీరాధివాసాంగ హోమం నిర్వహించారు. సర్పంచ్ పెద్దిరెడ్డి సత్య సాయిరాం దంపతులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి గణేష్
- శ్రీరంగపట్నంలో గడప గడపకూ..



శ్రీరంగపట్నంలో పథకాల గురించి వివరిస్తున్న జక్కంపూడి గణేష్

మధురపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. శ్రీరంగపట్నంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో అన్ని వర్గాల సంక్షేమానికి బాటలు పడ్డాయన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు ప్రజల్లో ఉంటూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా శ్రమిస్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. ప్రతి పథకం ప్రజలకు చేరాలన్న లక్ష్యంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజల కోసం శ్రమిస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. తుపానులు, ప్రకృతి వైపరీత్యాలకూ ప్రభుత్వాన్ని నిందించడం దుర్మార్గమన్నారు. నెల్లూరులో ఏళ్ల తరబడి పరిష్కారం కాని చుక్కల భూమిని సాగుదారులైన రైతన్నలకు అందించిన ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు పాలన చేరువైందన్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించిన కార్యక్రమంలో 320 గడపలు తిరిగారు. పార్టీ నాయకులు మద్దాల రమణ, సూరిశెట్టి అప్పలస్వామి, కొయిడాల నానాజీ, సూరిశెట్టి కుటుంబరావు, ఉల్లి గణ, శ్రీహరి, శ్రీరంగపట్నం పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుద్దా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో జాబ్ మేళా ప్రారంభం



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు మొత్తం 373 మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 142 మంది వివిధ పోస్టులకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జీబీఆర్ సెమినార్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత తమ నైపుణ్యాలను, సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ డిగ్రీ విద్యార్థులకు వివిధ అంశాల్లో నిపుణుల ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణను అందజేస్తూ ఉద్యోగులుగా మారుస్తోందని చెప్పారు. డీఎస్‌డీఓ ఎం.కొండలరావు మాట్లాడుతూ పరిశ్రమలకు, నిరుద్యోగులకు వారధిగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ పనిచేస్తోందన్నారు. జాబ్ మేళాలో టెక్ మహేంద్ర, ఏఏఎమ్ జియో స్పాటియల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ముతూట్ ఫైనాన్స్, ఫ్యూచర్ ప్రాపర్టీ సొల్యూషన్స్, పేటీఎం సర్వీసెస్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మసీ, జీ4ఎస్ సెక్యూర్ సొల్యూషన్స్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లిమిటెడ్, సంగీత మొబైల్స్, మోహన్ స్పిన్ టెక్స్, ఐఐఎఫ్ఎల్ కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ అబ్బాయిరెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది పెరుమాళ్లు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జి.మామిడాడ గ్రామం శివారు లక్ష్మీనరసాపురంలో నాడు–నేడు ఫేజ్ 2లో భాగంగా రూ.1.25 కోట్లతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి ఇంట్లో విద్యా వెలుగుల నింపాలని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా వసతి తదితర పథకాలతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని చెప్పారు. నాడు–నేడు పనులను పారదర్శకంగా సకాలంలో పూర్తి చేసి అదనపు తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మరెడ్డి, స్థలదాత మేడపాటి సూరారెడ్డి, సర్పంచ్ లంక మున్ని, ఉపసర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ కర్రి వెంకట పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగైన వైద్య సేవలందించాలి

పెదపూడి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సూపరింటెండెంట్ పి.సుజాత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో అధునాతన వైద్య సేవల విభాగాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో ఓపీ శాతం బాగా పెంచాలన్నారు. ఆస్పత్రిలో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కొంత మంది వైద్యులు సమయ పాలన పాటించడం లేదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పీఏసీఎస్ నిధుల నుంచి చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, సభ్యులు పందిరి సూర్యప్రకాశ్, తోటకూర వెంకట్రావు, సీఈఓ దుర్గారావు మొత్తం రూ.1 లక్ష విలువైన ఇన్వేటర్, ఈసీజీ మెషీన్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధులతో ఆపరేషన్ థియేటర్‌లో బీపీ మెషీన్, ఇతర సామగ్రి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర సాయిబాబు, కోరా వీర్రాజు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీవీబీ విద్యార్థుల ప్రతిభ

రాజానగరం: నామవరం భారతీయ విద్యాభవన్ విద్యార్థులు శుక్రవారం విడుదలైన సీబీఎస్ఈ 10వ, 12వ తరగతి పరీక్ష ఫలితాలను అత్యుత్తమ ఫలితాలను సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ వీరేంద్రనాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షలకు 51 మంది హాజరు కాగా 90 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. 12వ తరగతి పరీక్షలు 38 మంది విద్యార్థులు రాయగా నూరు శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: రఘుదేవపురం గ్రామానికి చెందిన పరిమి శోభారాణిని బొబ్బిల్లంకకు చెందిన ప్రసాద్ కొట్టారని ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు.

విద్యార్థులకు విద్యా కానుక కిట్లు



సీతానగరంలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీవైఈఓ తిరుమల దాస్

సీతానగరం: పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని డీవైఈఓ ఎం.తిరుమలదాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు వచ్చిన ఆయన జేవీకే కిట్లను, నాడు– నేడు పనులను పరిశీలించారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యా కానుక కిట్లను ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఎంఈఓ కె.స్వామినాయక్, హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు కన్నూరి సతీష్ బాబు, సీఆర్పీలు చంటిబాబు, రమణ, ప్రసాద్, బేగం తదితరులు పాల్గొన్నారు.